క్లుప్తంగా

హత్యాయత్నం కేసులో ఏడాది జైలుశిక్ష

మంగళగిరి: నగరంలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్ వద్ద జరిగిన దాడి ఘటనలో నిందితుడికి ఏడాది కఠిన కారాగార శిక్ష విధిస్తూ మంగళగిరి సెషన్స్ జడ్జి డి.శేషయ్య తీర్పు ఇచ్చారు. 2019లో నగరంలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్ వద్ద నగరానికి చెందిన కంబాల ఈశ్వరరావుపై తాడేపల్లి కేఎల్ రావు కాలనీకి చెందిన షేక్ రావూఫ్ బాషా మద్యం సీసాతో దాడి చేసి గాయపరిచాడు. భార్య కంబాల నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ నారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నిందితుడిని కోర్టుకు హాజరుపరిచారు. కోర్టు విచారణలో భాగంగా బాషాపై నేరం రుజువు కావడంతో జడ్జి నిందితుడు రావూఫ్ బాషాకు ఏడాది కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రేటూరి కిషోర్ బాధితుని తరఫున వాదనలు వినిపించారు.

శ్మశానవాటిక స్థలం కోసం పరిశీలన

ఫిరంగిపురం: గుండాలపాడు గ్రామదాసుల కాలనీ ప్రాంతాన్ని జేసీ రాజకుమారి మంగళవారం పరిశీలించారు. ఈ ప్రాంతవాసులు శ్మశానవాటిక కోసం స్థలం కేటాయించాలని గతంలో స్పందనలో అర్జీ ఇచ్చారు. దీనికోసం జేసీరాజకుమారి కాలనీ సమీపంలో ఉన్న స్థలాన్ని పరిశీలించారు. గతంలో ఉన్న శ్మశాన వాటిక స్థలం సరిపోవడంలేదంటూ కాలనీవాసులు జేసీకి తెలిపారు. ప్రభుత్వ భూమి వివరాలు తెలియజేయాలని తహసీల్దార్ పద్మనాభుడిని జేసీ ఆదేశించారు. అనంతరం బేతపూడి గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. పథకాల అమలు గురించి సంబంధిత శాఖల సిబ్బందిని ప్రశ్నించారు. సిబ్బంది రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఆమె వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఉండవల్లిలో మరో కొత్త రోడ్డు నిర్మాణం



తాడేపల్లిరూరల్: ఉండవల్లిలో మరో కొత్త గ్రావెల్ రోడ్డు నిర్మాణాన్ని మంగళవారం చేపట్టారు. ప్రకాశం బ్యారేజ్ మంగళగిరి పాత జాతీయ రహదారికి ఆనుకుని పోలకంపాడులో పైపుల కంపెనీ పక్కనే ఉన్న నివాసాలకు ఇప్పటి వరకు సరైన రోడ్డు లేదు. మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి సోమవారం ఉండవల్లి విచ్చేసిన సందర్భంగా అక్కడ నివాసముండే గాంధీ అనే వ్యక్తి వినతిపత్రం అందజేయడంతో 24 గంటల్లో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. దాంతో ఆ ప్రాంత వాసులు ఎమ్మెల్యే ఆర్కేకు ధన్యవాదాలు తెలిపారు.

బోరుపంపుకు మరమ్మతులు



తాడేపల్లిరూరల్: కృష్ణాయపాలెం పక్కనే ఉన్న పెనుమాక ఇందిరానగర్‌లో మంగళవారం కార్పొరేషన్ ఇంజినీరింగ్ సిబ్బంది బోరు పంపుకు మరమ్మతులు నిర్వహించారు. ఇందిరానగర్ పెనుమాక ప్రాంతానికి చెందినప్పటికీ గ్రామానికి చాలా దూరంగా ఉండటంతో అక్కడ నివసించే ప్రజలకు డైరెక్ట్ పంపింగ్ ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. విద్యుత్ మోటార్లు మరమ్మతులకు గురైన సమయంలో తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని స్థానికులు, ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకెళ్లడంతో కొన్ని ఏళ్ల నుంచి మరమ్మతులకు నోచుకోని బోరు పంపులను బాగు చేయించాలని ఆదేశించారు. వెంటనే ఇంజినీరింగ్ సిబ్బంది ఆ బోరు పంపుకు మరమ్మతులు నిర్వహించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే ఉపేక్షించొద్దు

తాడేపల్లిరూరల్: బహిరంగ ప్రదేశాలు, పంట పొలాలు, కాలనీ చివరి ప్రాంతాల్లో మద్యం సేవిస్తూ మహిళలు, యువతను, రైతులను మందుబాబులు ఇబ్బందులకు గురిచేస్తే సహించవద్దని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి సీఐ శేషగిరి రావుకు సూచించారు. మంగళవారం రాత్రి ఉండవల్లిలో నిర్మించిన కొత్త రోడ్ల పరిశీలన, కొత్తగా నిర్మించే పైపులైన్లపై సమీక్షా సమావేశానికి ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవితో కలసి పాల్గొన్నారు. ఉండవల్లిలో రోడ్లు పరిశీలిస్తున్న సమయంలో రాత్రి సమయంలో రోడ్లపైనే కొంత మంది యువకులు మద్యం సేవిస్తున్నారని, రోడ్డుపై నడుచుకుంటూ వస్తుంటే చాలా ఇబ్బందికరంగా ఉందని, మద్యం తాగి సీసాలను, బిర్యానీ ప్యాకెట్లను వదిలేస్తున్నారని, ఆ సీసాలను సైతం పగలకొట్టడం వల్ల ఇబ్బందులకు గురవుతున్నామని మహిళలు తెలియజేశారు. వెంటనే తాడేపల్లి సీఐ శేషగిరిరావును అక్కడకు పిలిపించి మహిళలతో ఫిర్యాదు చేయించి మందుబాబులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. స్థానిక సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించిన ఎమ్మెల్యే, ఫిర్యాదులను 15 రోజుల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఈ కృష్ణారెడ్డి, సెక్రటరీ రాధాకుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

తాగునీటిని వృథా చేయొద్దు

- ప్రతి ఒక్కరూ కృష్ణా జలాలు వినియోగించుకోండి
- పైప్‌లైన్‌లో డస్ట్‌ను కూడా తొలగిస్తున్నాం
- ప్రతి ఇంట్లో కృష్ణా జలాలను పరిశీలించిన ఎమ్మెల్యే ఆర్కే



ఉండవల్లి మూడు బొమ్మల సెంటర్ వద్ద కృష్ణా జలాలు ఏ విధంగా వస్తున్నాయో పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)

తాడేపల్లిరూరల్: కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛమైన కృష్ణా జలాలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని, నీటిని వృథా చేయవద్దని మంగళగిరి శాసన సభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం కార్పొరేషన్ పరిధిలోని ఉండవల్లి అమరావతి రోడ్డులో గుంటూరు చానల్ ఒడ్డున ఏర్పాటు చేసిన ప్రెజర్ శాండ్ ఫిల్టర్‌బెడ్‌లను పరిశీలించారు. అనంతరం కార్పొరేషన్ అధికారుల వద్ద వివరాలు తీసుకుని ప్రతి వీధిలోనూ చివరి నివాసాలకు కృష్ణా జలాలు పైప్‌లైన్ల ద్వారా ఏ విధంగా వస్తున్నాయన్న విషయాన్ని పరిశీలించారు. జామాయిల్ తోట దగ్గర నుంచి ఉండవల్లి సెంటర్ వరకు ఉన్న 18 రహదారుల్లో కృష్ణా జలాలు పైప్‌లైన్ల ద్వారా వస్తున్నాయన్న విషయాన్ని పరిశీలించిన ఆయన తరువాత బహుళ అంతస్తుల్లో మోటార్లు వినియోగించకుండా కృష్ణా జలాలు వస్తున్నాయా లేదా అన్న విషయాన్ని పరిశీలించారు. ఎవరూ విద్యుత్ మోటార్లు వినియోగించవద్దని, గ్రావిటీ ద్వారానే తాగునీరు ట్యాంకుల్లోకి ఫిల్లింగ్ చేసుకోవచ్చని సూచించారు. ఉండవల్లి ప్రాంతానికి అందించే కృష్ణా జలాలు రెండుసార్లు ఫిల్టర్ చేసి మీకు అందిస్తున్నామని, నేరుగానే ఈ నీటిని ఉపయోగించవచ్చని తెలిపారు. అనంతరం ఉండవల్లి సెంటర్‌లో ఉన్న 60 వేల లీటర్ల ఓవర్ హెడ్ ట్యాంక్ నుంచి పోలకంపాడులో ఉన్న నివాసాలకు తాగునీరు ఏ విధంగా వస్తున్నాయో చివరి ప్రాంతాల్లో ప్రతి ఇంటిని పరిశీలించారు. ఆ ప్రాంతాల్లో సరిగా తాగునీరు రాకపోవడంతో వెంటనే కొత్త పైపులైన్లు ఏర్పాటు చేయాలని డీఈ కృష్ణారెడ్డికి సూచించారు. ఉండవల్లి హరిజనవాడ, ఉండవల్లి ప్రాంతంలో కూడా త్వరలోనే కృష్ణా జలాలు అందించనున్నట్లు ఎమ్మెల్యే ఆర్కే స్పష్టం చేశారు. కార్యక్రమంలో సెక్రటరీ రాధాకుమారి, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు దంటు బాలాజీ, మంగళగిరి శివాలయం ట్రస్టు బోర్డు మెంబర్ కొల్లు మునలారెడ్డి, మాజీ ఎంపీటీసీ మేకల హనుమంతరావు, కళ్ళం సాంబిరెడ్డి, తోక సత్యనారాయణ, అనంత సత్యనారాయణ, బుర్రముక్కు భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.50 లక్షలతో డ్రెయిన్ పనులు ప్రారంభం



ఆశ్రమం రోడ్డులో నిర్మిస్తున్న డ్రెయిన్

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని పాత టోల్‌గేటు వద్ద నుంచి ఆశ్రమానికి వెళ్లే రహదారిలో మంగళవారం నుంచి కార్పొరేషన్ అధికారులు డ్రెయిన్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఆశ్రమం రోడ్డులో త్వరితగతిన అభివృద్ధి చెందినా అక్కడ డ్రైనేజీ లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. తాడేపల్లి మున్సిపాలిటీగా ఉన్నప్పటి నుంచి డ్రైనేజీ కావాలంటూ ఆ ప్రాంత వాసులు అధికారులకు విన్నవించుకున్నారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాలసోమిరెడ్డి అక్కడి పరిస్థితిని మంగళగిరి శాసన సభ్యుడు ఆర్కేకు వివరించడంతో మొదటి విడతలో ఆశ్రమం రోడ్డులో కొంత డ్రెయిన్‌ను నిర్మించారు. రెండవ విడతలో మొత్తం నాలుగు రోడ్లలో 2 అడుగుల లోతు, 2 అడుగుల వెడల్పుతో 50 లక్షల వ్యయంతో డ్రెయిన్ నిర్మాణ పనులు చేపట్టారు. మరో 20 రోజుల్లో పనులు పూర్తవుతాయని, ప్రజలు నీటిని ఎక్కువగా డ్రైనేజీల్లోకి వదలవద్దని సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ రవితేజ సూచించారు.

నేషనల్ వాలీబాల్ విజేత ఏపీ ఎస్ఆర్ఎం



ట్రోఫీని దక్కించుకున్న ఎస్ఆర్ఎం బాలికల జట్టు

మంగళగిరి: హైదరాబాద్ బిట్స్ పిలానీ క్యాంపస్‌లో ఈ నెల 2 నుంచి 5వ తేదీ వరకు జరిగిన జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ విజేతగా నిలిచింది. ఫైనల్స్‌లో సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాల (హైదరాబాద్) బాలికల జట్టుపై 3-0 పాయింట్ల తేడాతో ఏపీఎస్ఆర్ఎం బాలికల జట్టు విజయాన్ని కైవసం చేసుకుని ట్రోఫీని దక్కించుకుంది. జట్టు కెప్టెన్ భవిష్య, ఝాన్సీ, అనిష్క తదితరులు చక్కని ప్రతిభ కనబర్చి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు.

పవర్ లిఫ్టింగ్‌లో నయాన్‌కు ద్వితీయ స్థానం..



ఏపీ ఎస్ఆర్ఎం కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విద్యార్థి నయాన్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ద్వితీయ స్థానాన్ని దక్కించుకున్నాడు. 80 కిలోల క్యాటగిరీలో నయాన్ చక్కని ప్రతిభ కనబర్చి సిల్వర్ మెడల్‌ను కైవసం చేసుకున్నాడు. వాలీబాల్ జట్టు కోచ్ టి.వంశీ, మేనేజర్లుగా డాక్టర్ విజయకుమార్ ఉపాధ్యాయ, అబ్దుల్ మోహిమిన్ వ్యవహరించారు. విజేతలను యూనివర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ పి.సత్యనారాయణన్, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ మనోజ్‌కుమార్ ఆరోరా, రిజిస్ట్రార్ ఆర్.ప్రేమ్‌కుమార్ అభినందించారు.

స్వర్ణం సాధించిన కేఎల్‌యూ విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విద్యాలయంలో బీటెక్ చదువుతున్న విద్యార్థి కె.హర్షవర్ధన్ అంతర్జాతీయ జూనియర్ కరాటే పోటీల్లో బంగారు పతకాన్ని సాధించినట్లు క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.హరికిషోర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు విశాఖలో జరిగిన అంతర్జాతీయ జూనియర్ అండర్-17 కరాటే పోటీల్లో 7 దేశాలు పాల్గొనగా ప్రథమ స్థానాన్ని సాధించి హర్షవర్ధన్ బంగారు పతకాన్ని సొంతం చేసుకున్నాడన్నారు. అనంతరం స్వర్ణం సాధించిన హర్షవర్ధన్‌ను విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, విద్యార్థి వ్యవహారాల డీన్ చప్పిడి హనుమంతరావు, క్రీడల విభాగం ఇన్‌చార్జి డాక్టర్ కె.సుజాత, వ్యాయామ అధ్యాపకులు హర్షవర్ధన్‌ను అభినందించారు.

దేవస్థానం ఆస్తుల పరిరక్షణకు కృషి

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)

మంగళగిరి: నగరంలో వేంచేసిఉన్న లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన ఆస్తుల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అన్నారు. మంగళవారం నగరంలోని మన్నెం వారి బజారులో శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానానికి చెందిన స్థలంలో చేపట్టిన ప్రహరీ నిర్మాణంతో పాటు మెరక పనులను ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవితో కలసి పరిశీలించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ ఇటీవల నగరంలోని జాతీయ రహదారి సమీపంలోని లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన స్థలంలో నాలుగు కాళ్ల మండపం చుట్టూ ఆక్రమణలు తొలగించడంతో పాటు ప్రహరీ నిర్మించి పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మన్నెంవారివీధిలోగల నృసింహస్వామి దేవస్థానానికి చెందిన ఖాళీ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించడంతో పాటు మెరక పనులు చేపట్టడం జరిగిందన్నారు. దేవస్థాన ఈఓ అన్నపురెడ్డి రామకోటిరెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, సంకా బాలాజీ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

మసీదు అభివృద్ధికి రూ.లక్ష విరాళం అందజేత



మసీదు అభివృద్ధికి రూ.లక్ష విరాళాన్ని అందజేస్తున్న వైఎస్సార్ సీపీ మైనార్టీ నేతలు

నగరంలోని ఇప్పటం రోడ్డులోగల మసీద్ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. ఈ మేరకు మంగళవారం వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ మునగాల మల్లేశ్వరరావు, మైనార్టీ నాయకులు ఎండీ ఫిరోజ్, షేక్ హస్సన్, అంజుమన్ అధ్యక్షుడు పఠాన్ అష్ఫఖాన్ ఎమ్మెల్యే ఆర్కే పంపిన రూ.లక్ష విరాళాన్ని మసీద్ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కేకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కోర్టు ప్రాంగణాన్ని పరిశీలించిన ఆర్కే

నగరంలోని కోర్టుల ప్రాంగణాన్ని మంగళవారం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) సందర్శించారు. ఇటీవల మంగళగిరికి అదనపు జిల్లా కోర్టు మంజూరైన నేపథ్యంలో ఎమ్మెల్యే ఆర్కే కోర్టుల ప్రాంగణాన్ని సందర్శించి అదనపు జిల్లా కోర్టు ఏర్పాటు చేయనున్న భవనం, న్యాయమూర్తుల క్వార్టర్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు దొడ్డక బ్రహ్మానందరావు, తోట నరసింహారావు, ఎమ్మెల్యే ఆర్కేకు పూల మొక్కను అందజేశారు.

రైతు పక్షపాతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి అని మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం దుగ్గిరాలలో పశు ఆరోగ్య సేవా రథాన్ని ప్రారంభించేందుకు ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతన్నల శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమిస్తున్నారని చెప్పారు. రూ.36 లక్షల విలువైన వాహనాన్ని ప్రతి మండల కేంద్రానికి కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈ వాహనం రైతుల ఇళ్ల వద్దకే వెళ్లి పశు వైద్యుల పర్యవేక్షణలో పశువులకు వైద్యం అందించడం జరుగుందన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఈ వాహనం అందుబాటులో ఉంటుందని, టోల్‌ఫ్రీ నంబర్ 1962కి ఫోన్ చేసి అత్యవసర సేవలను వినియోగించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ బాజీ, ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ మేకతోటి అరుణ, ఎంపీడీవో కుసుమ శ్రీదేవి, తహసీల్దార్ మల్లేశ్వరి, వెటర్నరీ ఏడీ అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే టీడీపీ తప్పుడు ప్రచారం



లాం(తాడికొండ): నిరుపేదల అభివృద్ధిని చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు తప్పుడు ప్రచారానికి శ్రీకారం చుట్టడం సిగ్గుచేటని మాజీ మార్కెట్ యార్డు చైర్మన్లు అవుతు శ్రీనివాసరెడ్డి, దాములూరి రాము, ముఖ్య నాయకులు తాళ్ల శివనాగరాజు పేర్కొన్నారు. లచ్చన్న గుడిపూడి గ్రామంలో జరుగుతున్న గ్రావెల్ తవ్వకాలపై టీడీపీ నాయకులు తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేసి నిరసన తెలియజేసిన నేపథ్యంలో పలువురు నాయకులు స్పందించారు. ఈ సందర్భంగా లాం జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని జగనన్న కాలనీల్లో దాదాపు 50 వేల పైచిలుకు గృహ నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. తాడికొండ మండలంలోని లాం, దామరపల్లి అర్బన్ లేఅవుట్‌లు పలు గ్రామాల్లో కొనసాగుతున్న జగనన్న కాలనీల ఇళ్ల నిర్మాణానికి గ్రావెల్ అవసరం ఉన్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ అనుమతి మేరకు చేస్తున్న పనిపై అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. పేదల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని చేస్తున్న గ్రావెల్ తరలింపును రాజకీయంగా వాడుకునేందుకు తెనాలి శ్రావణ్ కుమార్ దుష్ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసమో ఆలోచించుకొని మాట్లాడితే మంచిదన్నారు.

ట్యాంకర్లతో తాగునీరు సరఫరా



తాడేపల్లిరూరల్: కొలనుకొండలో మంగళవారం ప్రజలకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేశారు. పైపులైను మరమ్మతుల నేపథ్యంలో తాగునీటి సరఫరాను నిలిపివేశారు. కొలనుకొండ గంగానమ్మ పేటలో పైపులైన్లు పగిలిపోయి మరమ్మతులకు గురికావడంతో బాగుచేసే నిమిత్తం ఆ ప్రాంతంలో ఇంజినీరింగ్ సిబ్బంది వాటర్ ట్యాంక్ నుంచి వెళ్లే తాగునీటిని నిలిపివేసి యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టారు. స్థానిక ప్రజలకు ఇబ్బంది లేకుంటా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసినట్లు ఇంజినీరింగ్ అసిస్టెంట్ క్రాంతి తెలిపారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే ఆర్కే

వైద్య ఖర్చుల కోసం రూ.లక్ష ఆర్థిక సాయం



వైద్య ఖర్చులకు ఎమ్మెల్యే ఆర్కే పంపిన రూ.లక్ష నగదును అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

మంగళగిరి: నియోజకవర్గ ప్రజలకు అవసరమైన వివిధ అభివృద్ధి పనులు చేపట్టి, వారి సమస్యలను పరిష్కరించడమే కాకుండా ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు తనకు చేతనైంతలో ఆర్థిక సాయం చేస్తూ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) మానవత్వాన్ని చాటుకున్నారు. ఇటీవల కామెర్లతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యర్రబాలెం సచివాలయం వలంటీర్‌కు రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందించగా, తాజాగా నిడమర్రు ఎస్సీ కాలనీకి చెందిన కాలే నాగరాజు వైద్య ఖర్చుల కోసం లక్ష రూపాయల ఆర్థిక సాయాన్ని అందజేశారు. నాలుగు నెలల క్రితం నాగరాజు ప్రమాదవశాత్తూ రేకుల షెడ్డు మీద నుంచి జారిపడ్డాడు. దీంతో వెన్నెముక దెబ్బతిని నరాలు చచ్చుబడి మంచానికే పరిమితమయ్యాడు. అతని కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమన్న విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే ఆర్కే క్షతగాత్రుడు నాగరాజుకు వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ మేరకు స్థానిక పార్టీ నేతలు నాగిరెడ్డి, శేషిరెడ్డి, మండెపూడి బుజ్జి, మండెపూడి నాగరాజు, కర్రి భాస్కర్, కె.నాగరాజు మంగళవారం క్షతగాత్రుని కలిసి ఎమ్మెల్యే ఆర్కే పంపిన లక్ష రూపాయలను అందించారు. సహాయం అందుకున్న లబ్ధిదారు కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే ఆర్కేకు కృతజ్ఞతలు తెలిపారు.

రూపురేఖలు మారిన ఉర్దూ పాఠశాలలు

ఉర్దూ పాఠశాలల ఉపతనిఖీ అధికారి ఎండీ ఖాసిం



రికార్డులను పరిశీలిస్తున్న ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎండీ ఖాసిం

తాడేపల్లిరూరల్: ఉర్దూ ప్రాథమిక పాఠశాలల రూపురేఖలు మారాయని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎండీ ఖాసిం అన్నారు. మంగళవారం దుగ్గిరాల మండల పరిధిలోని చిలువూరు, తుమ్మపూడి గ్రామాల్లో ఉర్దూ ప్రాథమిక పాఠశాలలను మండల విద్యాశాఖ అధికారి ఎ.శ్రీనివాసరావుతో కలసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. గతానికి భిన్నంగా ప్రస్తుతం ఉర్దూ పాఠశాలలు ఉన్నాయని, డీఈవో ఆదేశాల మేరకు పాఠశాలలు సక్రమంగా నిర్వహిస్తున్నారని చెప్పారు. ఉపాధ్యాయులకు ఎఫ్ఏ3 పరీక్షల నిర్వహణ గురించి పలు సూచనలు చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించి, విద్యార్థులను పలు ప్రశ్నలు చేసి సమాధానాలు రాబట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నూరల్ హుదా అన్సారి, నూరుల్ హుస్సేన్, షేక్ ఇస్మాయిల్, ఫరీదా బేగం, ఖాలీదా ఖాతూన్ తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్‌డేను జయప్రదం చేయండి

ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు



మాట్లాడుతున్న జొన్నా శివశంకరరావు

తాడేపల్లిరూరల్: వ్యవసాయ సంక్షోభానికి పరిష్కారాలు చూపని కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఫిబ్రవరి 9వ తేదీ నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు అన్నారు. మంగళవారం ఎంటీఎంసీ పరిధిలోని కొలనుకొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి నిధులు తగ్గించారన్నారు. గత బడ్జెట్‌లో పీఎం కిసాన్ నిధికి 12950 కోట్లు ఉంటే ఈ బడ్జెట్‌లో 10787 కోట్లకు తగ్గించారని ప్రశ్నించారు. పీఎం కిసాన్ పథకం కింద 6 వేల రూపాయలు ఇస్తున్నారని, ఈ డబ్బులుదేనికీ చాలడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. బీజేపీ విధానాలు కార్పొరేట్ శక్తుల అభివృద్ధి కోసం తప్ప ప్రజల కోసం కాదన్నారు. ఈ బడ్జెట్‌ను నిరసిస్తూ బ్లాక్‌డేని పాటించాలని కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా గుంటూరు జిల్లాలోని బీఎస్ఎన్ఎల్, పోస్టాఫీసుల ఎదుట ధర్నా నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో రైతులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో ఏపీ రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి కాజా వెంకటేశ్వరరావు, రైతు సంఘం ఉండవల్లి మండల నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కాట్రగడ్డ శివరామకృష్ణయ్య, బి.శివారెడ్డి, మంగళగిరి మండల రైతు నాయకులు మొసలి జ్యోతిబస్, కాట్రగడ్డ శివన్నారాయణ, కాట్రగడ్డ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ లబ్ధి

ఎంపీడీవోల సమీక్షలో ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి



తాడికొండ: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ లబ్ధి చేకూర్చాలని తాడికొండ ఎమ్మెల్యే, రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. గుంటూరులోని తన కార్యాలయంలో ఎంపీడీవోలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ ప్రజల నుంచి నేరుగా అందే వినతులతో పాటు వలంటీర్ల ద్వారా అందే వినతుల పరిష్కారం సత్వరం చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎంపీడీవోలు, సిబ్బంది అలసత్వం వహిస్తే సహించేది లేదని, నిర్ణీత గడువులోగా వినతులు పరిష్కారం చేయాలని చెప్పారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరైన నిధులతో కొనసాగుతున్న పనులు త్వరితగతిన పూర్తయ్యేలా పర్యవేక్షించాలని సూచించారు. గ్రామాల్లో కొనసాగుతున్న జగనన్న కాలనీల్లోని ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీలో ఆశాడే

మంగళగిరి: పెదవడ్లపూడి డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో మంగళవారం ఆశా డే కార్యక్రమం నిర్వహించారు. నవజాత శిశువు, మాతాశిశు సంరక్షణ, లెప్రసీ సర్వేలపై ఆశా వర్కర్లకు అవగాహన కల్పించారు. వైద్యాధికారి డాక్టర్ ఎం.రమేష్, మెడికల్ అధికారి సీహెచ్ రామానంద్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అమ్ముతున్న యువకులు అరెస్ట్

తాడేపల్లిరూరల్: పోలకంపాడులో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వడ్డేశ్వరానికి చెందిన కుంభా వెంకటేష్, ఉండవల్లికి చెందిన కళ్లా వేమన వసంతకుమార్ వద్ద 10 ప్యాకెట్లలో 600 గ్రాముల గంజాయి లభించింది. వీరిద్దరినీ అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు సీఐ శేషగిరిరావు తెలిపారు.